సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 16 । జూన్ । 2023



బీజేపీ, బీఆర్‌ఎస్ తోడు దొంగలు

రీజనల్‌రింగ్ రోడ్డు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయని కోదండరెడ్డి అన్నారు. - 10లో



ప్రభుత్వం ల్యాండ్ బ్రోకర్‌గా మారింది

తెలంగాణ ప్రభుత్వం ల్యాండ్ బ్రోకర్ సంస్థగా మారిందని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం 41°/29°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కబోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నృసింహుడికి సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

భట్టిని కలిసిన కుంభం



భట్టి విక్రమార్కతో కేక్ కట్ చేయిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం రాత్రి నల్లగొండలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను కలిశారు. కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట తంగెళ్లపల్లి రవికుమార్ తదితరులు ఉన్నారు.

చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ సస్పెన్షన్

భువనగిరి: చందుపట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఎలిమినేటి మల్లారెడ్డి గురువారం తెలిపారు. ఈమేరకు తాత్కాలిక ఉపశమనం కింద ఇచ్చిన స్టే ఆర్డర్‌ను హైకోర్టులో ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసినట్లు తీర్పు వెల్లడించిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ సహకారం సంఘం నిధులను దుర్వినియోగం చేసినట్లు సంఘం వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు జిల్లా వ్యవసాయ సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఈ విషయంపై ఆడిట్ నిర్వహించగా చైర్మన్ అవకతవకలకు పాల్పడినట్లు నిరూపణ కావడంతో చైర్మన్‌ను సస్పెండ్ చేశారు. ఆయన సస్పెన్షన్‌పై హైకోర్టులో రెడ్ పిటిషన్ వేయగా.. డీసీఓ ఆర్డర్‌ను కోర్టు తాత్కాలిక ఉపశమనం కింద స్టే ఆర్డర్ ఇచ్చింది. ఈ విషయంపై సంఘం వైస్ చైర్మన్ హైకోర్టులోని ద్విసభ్య బెంచ్‌లకు అప్పీల్ చేయగా జూన్ 8న హైకోర్టు దిసభ్య ధర్మాసనం స్టేను తొలగించి కేసును కొట్టివేసిందని, దీంతో ఆయనను పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఈ విషయంపై డీసీఓ పరిమళను అడగగా చైర్మన్‌ను సస్పెన్షన్ వాస్తవమేనని తదుపరిగా చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పథంలో తండాలు



అభివృద్ధి గురించి తెలుసుకుంటున్న రాజారావు

బీబీనగర్: గిరిజన తండాలు పంచాయతీలుగా ఏర్పడ్డాక అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ రాజారావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బీబీనగర్ మండలంలోని మీదితండాలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డ్, గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించారు. జెండా ఆవిష్కరణ అనంతరం పంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఏపీడీ శ్యామల, ఎంపీడీఓ శ్రీవాణి, ఏపీఓ కళావతి, సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ బీమ్లానాయక్ పాల్గొన్నారు.

18 మంది గైర్హాజరు

భువనగిరి : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. గురువారం నిర్వహించిన హిందీ పరీక్షకు 26 మంది విద్యార్థులకు గాను 8మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

ఆరుతడిపై దృష్టి!

పత్తి, కందికి అధిక ప్రాధాన్యం

- 2 లక్షల ఎకరాల్లో సాగు చేయాలన్నది లక్ష్యం
- వరి తగ్గించాలని ప్రభుత్వ నిర్ణయం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



గత వానాకాలం పంటల సాగు (ఎకరాల్లో)..

మొత్తం పంటలు	వరి	ఆరుతడి
4,38,534	3,15,410	1,23,124

సాక్షి, యాదాద్రి : వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయంగా పత్తి, కంది పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లా వ్యవసాయ ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గత వానాకాలం వివిధ నీటి వనరుల కింద సాగు చేసిన వరి వివరాలను సేకరిస్తోంది. అంతేకాకుండా పత్తి, కంది సాగుపై రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

గత వానాకాలం ఇలా..

గత వానాకాలం జిల్లా వ్యాప్తంగా 91 క్లస్టర్లు, 323 గ్రామ పంచాయతీల పరిధిలో 4,38,534 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేశారు. ఇందులో వరి 3,15,410 ఎకరాలు, పత్తి 1.20లక్షల ఎకరాలు, కంది 8 వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే జిల్లాలో 89,648 వ్యవసాయ బోర్లు ఉండగా వాటి కింద 2,31,394 ఎకరాలు, 9,760 బావుల ద్వారా 29,973 ఎకరాలు, కాల్వల కింద 21494 ఎకరాలు, లిఫ్ట్ ఇరిగేషన్‌తో14,448ఎకరాలు, 1,358 చెరువుల కింద 18,101 ఎకరాలు సాగైంది. ఈ సారి కూడా అంతకంటే ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

బోరు బావుల ద్వారా..

జిల్లాలో ఎక్కువగా బోరు బావులు భువనగిరి మండలంలో 8,692, వలిగొండ 8433, చౌటుప్పల్ 7797, బొమ్మలరామారం 6,078, ఆలేరు మండలంలో 6,017 ఉన్నాయి. తక్కువగా భూదాన్‌పోచంపల్లిలో 2,023 బోరు బావులు ఉన్నాయి.

వ్యవసాయ బావుల కింద..

జిల్లాలో సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఐదు, రామన్నపేట 1,470, ఆత్మకూర్(ఎం) 1205, మోత్కూర్‌లో 1,173 వ్యవసాయ బావులు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఈసారి ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించనున్నారు. నాలుగు మండలాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ జిల్లాలో కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే లిఫ్టుల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ భువనగిరి, వలిగొండలోఒక్కో లిఫ్ట్ చొప్పున ఉన్నాయి.

ఎక్కువ చెరువులున్న మండలాలు

వలిగొండ మండలంలో జిల్లాలో అత్యధికంగా 135 చెరువులు ఉన్నాయి. ఆ తర్వాత తుర్కపల్లి 130, మోత్కూరు 121, అడ్డగూడూరు, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో 48 చొప్పున చెరువులు ఉన్నాయి.

వర్షాధారిత పంటలు 1,23,124 ఎకరాలే

వర్షాధారం ద్వారా గత వానాకాలంలో 1,23,124 ఎకరాలు సాగు చేశారు. ఇందులో పత్తి, కందులు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ సారి పత్తి, కంది సాగు పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, 50 వేల ఎకరాల్లో కందులు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించి వరి సాగును తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

వరి తగ్గించాలి



జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సాగు నీటి వసతి ఉన్నందున ప్రత్యామ్నాయ పంటలు వేయాలని ప్రభుత్వం కోరుతోంది. పత్తి, కంది సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగు చేయించాలన్నది లక్ష్యం. రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు ప్రారంభించాం.

–అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

అన్నీ ఉన్నా అడిగినంత ఇవ్వాల్సిందే!

- వసూళ్లకు పాల్పడుతున్న యాదగిరిగుట్ట తహసీల్దార్
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.5వేలు డిమాండ్
- ప్రొటోకాల్, ఇతర ఖర్చుల పేరుతో వసూలు



యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తహసీల్దార్ శోభన్‌బాబు గురువారం ఓ వినియోగదారుని వద్ద స్వయంగా రూ.5వేలు డిమాండ్ చేయడం, అందుకు సంబంధించిన వీడియో కూడా వైరల్ కావడం చర్చనీయాంశమైంది. బాధితుడు కర్రె ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు ప్రాంతానికి చెందిన కర్రె ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన ఓ రైతు వద్ద ఎకరం భూమి కొనుగోలు చేశాడు. మూడు రోజుల క్రితం అర ఎకరం, అర ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. గురువారం పాస్‌పుస్తకం కోసం కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ రూ.5 వేలు అడిగారు.డాక్యుమెంట్స్ అన్నీ సరిగ్గానే ఉన్నాయని, డబ్బులు ఎందుకు సార్ అని సదరు వ్యక్తి వాదించగా.. తమకు ప్రొటోకాల్, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పకుండా ఇవ్వాల్సిందేనని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. దీంతో ప్రవీణ్ డబ్బులు ఇవ్వకుండా బయటకు వచ్చి జరిగిన విషయాన్ని విలేకరులకు తెలియజేశాడు. గతంలో కూడా తమ సంబంధికుల నుంచి తహసీల్దార్ డబ్బులు డిమాండ్ చేసినట్లు బాధితుడు తెలిపారు. ప్రతీ రిజిస్ట్రేషన్‌కు సుమారు రూ.5వేలు తీసుకుంటున్నట్లు అక్కడే ఉన్న పలువురు వ్యక్తులు తెలిపారు.

దుష్ప్రచారం చేస్తున్నారు : తహసీల్దార్

పాస్ బుక్ తీసుకోవడానికి వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన విషయమై తహసీల్దార్ శోభన్‌బాబును వివరణ కోరగా తాను డబ్బులే అడగలేదన్నారు. కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

నాడు ఎన్టీఆర్.. నేడు కేసీఆర్



సుద్దాలలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో విప్ సునీత, జెడ్పీ చైర్మన్



మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి, చిత్రంలో ప్రభుత్వ విప్ తదితరులు

- గ్రామాల అభివృద్ధికి కృషి చేసింది వారే..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గుండాల : గ్రామాల అభివృద్ధిని ఆనాడు ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేడు కేసీఆర్ పూర్తిగా అభివృద్ధి చేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తెలుగుదేశం రాజ్యం, కాంగ్రెస్ రాజ్యం చూసిన కానీ, కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రిని చూడలేదని చెప్పారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత్ విద్యుత్‌ను కేసీఆర్ అందిస్తున్నట్లు తెలిపారు. గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేశారని చెప్పారు. గతంలో ఇక్కడి భూముల విలువ ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష ఉంటే.. తెలంగాణ వచ్చిన తరువాత గోదావరి జలాలు అందడంతో ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి ధర పలుకుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నౌకరున్న వ్యక్తికే పిల్లను ఇచ్చేవారని, ఇప్పుడు భూములు ఉన్న వారికే పిల్లను ఇస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో 5 గంటల విద్యుత్ ఇచ్చి మోటార్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో మీటర్లు పెడితే కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఇస్తామని ఆశ చూపినా ముఖ్యమంత్రి తిరస్కరించారని చెప్పారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాలలో ఎకరాకు రూ.2 వేలు రైతుబంధు ఇస్తుంటే తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రైతులు తెలంగాణలో ఒక్కొక్క గుంట భూములు కొనుక్కొని నీటిని, కరెంటును వారి పొలాలకు తరలిస్తూ సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. భారత దేశంలో నీటి వనరులు పడిపోతుంటే తెలంగాణలో నీటి వనరులు పెరిగాయని చెప్పారు.

బీజేపీ దేశాన్ని నాశనం చేస్తోంది

దేశాన్ని గతంలో కాంగ్రెస్ వాళ్లు నాశనం చేశారు.. ఇప్పుడు బీజేపీ నాశనం చేస్తోందని మంత్రి ఆరోపించారు. తెలంగాణ విభజన సమయంలో విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉందా అని గ్రామస్తులను ప్రశ్నించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మహిళా సంఘాలకు రుణాల చెక్కు అందజేశారు. బిక్కేరు వాగుపై రూ.14.50 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీపీ తాండ్ర అమరావతి, జడ్పీటీసీ కోలుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎం.డి.ఖలీల్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సునంద, మైనింగ్ ఏడీ వెంకటరమణ, డీఎల్‌పీవో కె.యాదగిరి, ఎంపీడీవో జి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.జ్యోతి, డీఆర్‌డీవో నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బోనాలు, బతుకమ్మలతో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు.

నేడు పట్టణ ప్రగతి దినోత్సవం

భువనగిరి టౌన్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో జాతీయ పతాకాలను ఎగురవేయనున్నారు. అనంతరం చైర్మన్లు ప్రగతి నివేదికను వివరిస్తారు. జాతీయ స్థాయిలో సాధించిన అవార్డుల వివరాలను తెలియజేస్తారు. వీటితో పాటు ఇంటిగ్రేటెడ్, డంపింగ్‌యార్డులు, అర్బన్ ఫారెస్ట్, పార్కుల నిర్మాణం, టీపాస్ చట్టం తదితర అంశాలపై వివరించనున్నారు. అలాగే ఎంపిక చేసిన ఉత్తమ మున్సిపాలిటీల చైర్మన్లు, కౌన్సిలర్లు, ఉద్యోగులను సన్మానిస్తారు.

జాడలేని చినుకు



విత్తనాలు విత్తడానికి రామన్నపేట సమీపంలో సిద్ధంగా ఉన్న భూమి

- మృగశిర కార్తె గడుస్తున్నా కురవని వర్షం
- మెట్ట పంటలకు దాటిపోతున్న అదును
- రైతుల్లో ఆందోళన

రామన్నపేట : మృగశిర కార్తె గడుస్తున్నా వరణుడు పలకరించడం లేదు. ఆరుతడి పంటల సాగుకు అనువైన కాలం దాటిపోతుంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో వరితో పాటు పత్తి, కంది, ఆముదం, జొన్న వంటి మెట్ట పంటలను సాగు చేస్తుంటారు. మెట్ట పంటలు సాగుచేసే రైతులు మే నెల చివరి వారం, జూన్ మొదటి వారంలో కురిసే తొలకరి వర్షాలకు దుక్కులను సిద్ధం చేస్తుంటారు. ఆ తరువాత కురిసే వానలకు విత్తనాలను విత్తుతుంటారు. ఇప్పటి వరకు తొలకరి వర్షాలు లేవు. మే నెలలో అక్కడక్కడా కురిసిన అకాల వర్షాలకు కొంతమంది రైతులు దుక్కులు సిద్ధం చేశారు. ఇప్పటికీ జిల్లాలో 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వరుసగా వర్షాలు కురిసి భూమి చల్లబడితే తప్ప విత్తనాలు విత్తే అవకాశాలు లేవు. జిల్లాలో 4,50,757 ఎకరాల సాగు భూమి ఉంది. 2,27,156 మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల్లో పత్తితో పాటు ఇతర మెట్ట పంటలు సాగు చేసే అవకాశం ఉంది. పత్తిసాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. మరో నాలుగైదు రోజుల్లో వర్షాలు కురువకపోతే మెట్టపంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

ఈపాటికి మొలకలు వచ్చేవి



ఏటా రోహిణి కార్తెలోనే విత్తనాలు పెట్టేవాళ్లం. ఈ పాటికి మొలకలు వచ్చేవి. ఈ సారి ఇంతవరకు వానలు పడలేదు. పదిరోజుల కింద పడ్డ వానలకు కొందరు దుక్కులు దున్ని పెట్టుకున్నారు. చాలా మంది రైతులు దుక్కులే దున్నలేదు. నాలుగైదు సంవత్సరాలుగా ఇటువంటి పరిస్థితి చూడ లేదు.

–పన్నె మాధవరెడ్డి, రైతు, రామన్నపేట

వానల కోసం ఎదురుచూస్తున్నాం



ఏటా వానాకాలం వరితోపాటు పత్తి సాగు చేస్తాం. ఈ పాటికి విత్తనాలు పెట్టేవాళ్లం. ఈసారి కూడా దుక్కులు సిద్ధం చేసి విత్తనాలను కొనుగోలు చేసిన వానల కోసం ఎదురుచూస్తున్నాం. వారం పదిరోజులు అయితే అదును తప్పిపోతుంది. విత్తనాలు పెట్టినా దిగుబడి సరిగా రాదు.

–శ్రీనివాస్‌రెడ్డి, రైతు, రామన్నపేట

బీబీనగర్ తహసీల్దార్ బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

బీబీనగర్ : నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రూ.కోట్లు విలువ చేసే భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులకు సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీబీనగర్ తహసీల్దార్ అశోక్‌రెడ్డిని బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఆదేశాలు జారీ చేశారు. బీబీనగర్ మండలంలోని కొండమడుగు గ్రామ పరిధిలోని 591, 592, 595 సర్వే నంబర్లలోని వసంత పేరున ఉన్న భూమి 4 ఎకరాల 23 గుంటలు కొందరు నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయమై సంబంధిత వ్యక్తులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేశారు. కొద్ది రోజుల తర్వాత భూ యజమాని పేరుతోనే ఉన్న మరో మహిళ పేరుతో సృష్టించిన నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసి పాస్ పుస్తకాలు జారీ చేశారు. దీనిపై ఈనెల 10వ తేదీన 'రూ.50 కోట్ల భూమికి ఎసరు' అనే శీర్షికన సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ హరిశంకర్‌ను బదిలీ చేశారు. నూతన తహసీల్దార్‌గా ఆంజనేయులను నియమించారు.

సవా'లక్ష' ఇబ్బందులు!

రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తుదారుల పాట్లు

- సర్వర్‌లో తరచూ సమస్యలు
- గంటల తరబడి మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో నిరీక్షణ
- ధ్రువీకరణ పత్రాల మంజూరీలో జాప్యం
- ఆసరాగా చేసుకుంటున్న దళారులు
- సర్టిఫికెట్లు త్వరగా ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.500 వసూలు



భువనగిరి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

భువనగిరిటౌన్: బీసీ వర్గాల్లోని చేతి, కులవృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం దరఖాస్తుదారులకు పాట్లు తప్పడం లేదు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆయా కులాల వారు మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో బారులుదీరుతున్నారు. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.500 ఇస్తే ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇప్పిస్తామని డబ్బులు దండుకుంటున్నారు. దరఖాస్తు గడువు మరో ఐదు రోజులే ఉండడం, సర్వర్ సమస్యతో ధ్రువీకరణ పత్రాలు మంజూరీలో జాప్యం జరుగుతుండడంతో గత్యంతరం లేక దళారులు అడిగినంత దరఖాస్తుదారులు ఇచ్చుకుంటున్నారు.

'మీసేవ'ల్లోనూ బాదుడు

రూ.లక్ష ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినవారితో జిల్లాలోని మీ సేవ కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి. దీంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ఒక దరఖాస్తు ఆన్‌లైన్ చేస్తే రూ.200 తీసుకుంటున్నారు. దరఖాస్తు ఫీజు రూ.35 నుంచి రూ.55 వరకు మాత్రమే ఉంటుంది. కానీ, మీ సేవ కేంద్రాలపై పర్యవేక్షణ లేకపోవడంతో అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు దరఖాస్తుదారులు వాపోతున్నారు.

3,700 దరఖాస్తులు

రూ.లక్ష ఆర్థిక సాయానికి మీ సేవ కేంద్రాల ద్వారా గురువారం నాటికి జిల్లా వ్యాప్తంగా జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయానికి 3,700 దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం చెప్పిన 15 కులాలే కాకుండా బీసీ వర్గానికి చెందిన అన్ని కులాలకు చెందిన వారు ఓబీసీ కింద దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉంది.

అర్హులే దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన వారు ఈ నెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అన్ని ధ్రువపత్రాలు సరిగ్గా అప్లోడ్ చేసుకోవాలి. గతంలో లబ్ధిపొందిన వారు దరఖాస్తు చేసుకున్నా వ్యర్థం. కేవలం ప్రభుత్వం ఇస్తున్న 15 కులాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటివరకు 3,700 దరఖాస్తులు వచ్చాయి.

–యాదయ్య, బీసీ సంక్షేమ అధికారి

గంటల తరబడి నిరీక్షణ

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం జనం మండుటెండలో అల్లాడుతున్నారు. మీ వ కేంద్రాల వద్ద నిరీక్షించడానికి ఓపిక లేక పడరాని పాట్లు పడుతున్నారు.దీనికి తోడు ఓ వైపు గడువు సమీపిస్తుండడం, మరో వైపు సర్వర్‌లో సమస్యలు తలెత్తుతుండడం దరఖాస్తుదారులను కలవరపెడుతోంది.

• పారిశుద్ధ్య సిబ్బందికి సలామ్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా రామన్నపేట మండలం వెల్లంకిలో పారిశుద్ధ్య సిబ్బందిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న గ్రామస్తులు

మహిళా సంఘాల పనితీరు భేష్

- ప్రశంసించిన ఉత్తరప్రదేశ్ బృందం
- కొలనుపాకలో మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం



మహిళా సంఘుల సభ్యులతో సమావేశమైన ఉత్తరప్రదేశ్ అధికారుల బృందం

ఆలేరురూరల్ : మహిళలు సంఘాలుగా ఏర్పడి, బ్యాంకు రుణంతో స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకొని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న తీరు అద్భుతమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన నేషనల్ రూరల్ లవ్లీవుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) బృందం ప్రశంసించింది. 32 మందితో కూడిన అధికారుల బృందం ఎన్‌ఐఆర్‌డీ సహకారంతో గురువారం ఆలేరు మండలంలోని కొలనుపాకను సందర్శించింది. గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. సంఘాల పనితీరు, పొదుపు, బ్యాంకుల నుంచి రుణం పొందడం, చెల్లింపులు, స్వయం ఉపాధి అవకాశాలు, వ్యాపారంలో ఒడిదుడుకులు తదితర విషయాలపై అధ్యయనం చేశారు. ఆర్థిక ప్రగతిపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని ఎవరిపై ఆధారపడకుండా సొంతకాళ్లపై నిలబడడం గొప్ప విషయం అని కితాబునిచ్చారు. పొదుపు సంఘాల ఏర్పాటు, పనితీరు తదితర విషయాలతో కూడిన నివేదికను తమ ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. అధికారుల బృందంలో ఎన్‌ఆర్‌ఎల్‌ఎం మిషన్ మేనేజర్ అభిషేక్ గోస్వామి, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం మిషన్ ఎగ్జిక్యూటివ్ షెహాల్‌సింగ్, యాదాద్రి జిల్లా ఐకేపీ డీపీఎం శ్రీనివాస్, ఆలేరు, యాదగిరిగుట్ట ఏపీఎంలు, ఆర్.మీనా, సుధాకర్, ఎస్‌హెచ్‌జీల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడు అదృశ్యం

భువనగిరి: మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు గురువారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అతడి తండ్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమల కొండూరు గ్రామానికి చెందిన కర్కి బాలమల్లేష్ పెద్ద కుమారుడు భానుప్రసాద్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో గత కొద్దిరోజులుగా ముభావంగా ఉంటున్నాడు. కాగా గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి బయల్దేరిన భానుప్రసాద్ చీమలకొండూరు గ్రామానికే చెందిన సతీష్ బైక్‌పై వెళ్తుండగా అతడిని లిఫ్ట్ అడిగి కుమ్మరిగూడెం గ్రామంలో దిగాడు. అక్కడ సతీష్ కుమారుడు సంతోష్ కలవగా, అతడి బైక్‌పై ఎక్కి రాయగిరి కమాన్ వద్ద దిగాడు. అనంతరం ఎక్కడికి వెళ్లాడో తెలియరాలేదు. అయితే సాయంత్రం వరకు భానుప్రసాద్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువకుడి తండ్రి మల్లేష్ భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. భానుప్రసాద్ పసుపు, నల్లని టీషర్ట్ ధరించి ఉన్నాడని, 5 అడుగుల 6 అంగుళాలు ఎత్తు ఉంటాడని, అతడి ఆచూకీ తెలిసిన వారు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

మంటలు అంటుకొని దగ్ధమైన ధాన్యం



గుండాల: గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించగా, ఆ మంటలు పక్కనే ఉన్న సుమారు 24 బస్తాల ధాన్యం అంటుకొని దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గుండాల మండలంలోని పెద్దపడిశాలలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపడిశాల గ్రామానికి చెందిన గడ్డం దుర్గయ్య తన రెండెకరాల పొలంలో పండించిన ఆర్‌ఎన్‌ఆర్ వరి ధాన్యాన్ని(సన్న ధాన్యం) తన వ్యవసాయ బావి వద్ద బండ మీద ఎండబెట్టాడు. కాగా గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు వరి పొలంలో నిప్పు వేయడంతో వరి కొయ్యలు కాలుకుంటూ వచ్చి వడ్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి దుర్గయ్యకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ వడ్లు కాలిబూడిదయ్యాయి. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఆత్మకూరుకు చెందిన మల్లేశం
- ఇప్పటికే చికిత్సకు రూ. 5లక్షలు ఖర్చు
- మందులకు మరో రూ. 5లక్షలు అవసరమంటున్న వైద్యులు
- దాతలు సాయమందించాలని వేడుకోలు



మల్లేశంకు అన్నం తినిపిస్తున్న భార్య ధనలక్ష్మి

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 99592 18134
గూగుల్‌పే నంబర్: 99592 18134

కన్నీటి గాథ



చికిత్స పొందుతున్న బత్తిని మల్లేశం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బత్తిని మల్లేశం బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు ఇప్పటికే రూ.5లక్షల వరకు ఖర్చు చేశాడు. చేతిలో డబ్బులు లేని కారణంగా భార్య బంగారం అమ్మగా వచ్చిన డబ్బులు, బంధువులు సహకారం అందించగా వాటితో చికిత్స చేయించుకున్నాడు. వ్యాధి పూర్తిగా నయం కావడానికి మరో రూ.5లక్షలు అవసరమని డాక్టర్లు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

కారు రిపేరు చేస్తున్న క్రమంలో..

మల్లేశం వయసు 38 సంవత్సరాలు. కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. భార్య ధనలక్ష్మి కూలి పని చేస్తుంటుంది. వీరికి ఇద్దరు సంతానం. తొమ్మిది సంవత్సరాల బాబు కృష్ణవంశీ, ఏడు సంవత్సరాల పాప లిఖిత ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం తాను నడుపుతున్న కారును రిపేరు చేస్తున్న క్రమంలో తలకు డోర్ తగిలి తీవ్ర గాయమైంది. దీంతో భువనగిరిలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి తలనొప్పితో బాధపడుతున్నాడు. రెండు సంవత్సరాల అనంతరం అతనికి పెరాలిసిస్ వచ్చింది. దీంతో కళ్లు కనిపించకుండా పోయాయి. తలనొప్పి తీవ్రం కావడంతో గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పెరాలసిస్ సమస్యతో బ్రెయిన్ ట్యూమర్ ఫామ్ అయినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ హాస్పిటల్‌లో చూపించుకున్నాడు. చికిత్స నిమిత్తం రూ. 5లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఆరు నెలల నుంచి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించుకుంటున్నాడు. నెలకు నాలుగు సార్లు ట్రీట్మెంట్ చేయించుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. మందుల ఖర్చు నెలకు రూ. 50వేల వరకు అవుతుందని, ఏడాది మొత్తం వాడితేనే వ్యాధి తగ్గుముఖం పడుతుందని, లేకుంటే కష్టమని డాక్టర్లు చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో డబ్బులు లేక ఈ నెల హాస్పిటల్‌కు కూడా పోలేదని వాపోయారు. మల్లేశం మామూలు వ్యక్తిగా మారాలంటే రూ. 5లక్షల వరకు అవసరం ఉంటుంది. దాతలు సహకరించి ట్రీట్‌మెంట్ కోసం ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

చెన్నారంలో భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్ నాయక్, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు



కేక్ కట్ చేస్తున్న భట్టివిక్రమార్క, చిత్రంలో దుబ్బాక నర్సింహారెడ్డి తదితరులు

- పాదయాత్ర క్యాంపు వద్ద వేడుకల్లో పాల్గొన్న సీఎల్పీ నేత

నల్లగొండ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నల్లగొండ నియోజకవర్గం పరిధిలోని జి.చెన్నారం గ్రామం సమీపంలో పాదయాత్ర నిర్వహిస్తున్న క్యాంపు వద్ద వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. భట్టి సతీమణి నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్యలు ఆయనతో కట్ చేయించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటాపాటలతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అమెరికాలో ఉన్న పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఫోన్ చేసి భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు చెన్నారం గ్రామం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నాయకులు బీర్ల ఐలయ్య, కైలాస్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, వడ్డె నారాయణ, సత్యం, వెంకట్, పద్మ, శకుంతలారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏపీ నేతలు

ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో 30 మంది సభ్యుల బృందం చెన్నారానికి వచ్చిన భట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్ర శిబిరం వద్ద పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ , విజయవాడ సిటీ ప్రెసిడెంట్ నారిశెట్టి నర్సింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర కిరణ్, అమరావతి అధ్యక్షుడు సురేష్, నాయకులు జంధ్యాల శాస్త్రీ, పోతురాజు ఏసు, వేముల శ్రీనివాస్, దోసపాటి గిరి, రామకృష్ణ, చెరుకు ఆనందరావు, గౌస్, రమణ, సురేష్, గొల్ల కృష్ణ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని విజయవాడ కనకదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహించినట్లు వారు చెప్పారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

- అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ మినీ బస్సు
- ఒకరిద్దరికి స్వల్పగాయాలు

రాజాపేట: యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు వస్తున్న ఆర్టీసీ మినీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లి ఆగింది. ఒకరిద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా మిగతా క్షేమంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన గురువారం రాజాపేట మండలంలోని కాల్వపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు ఆర్టీసీ మినీబస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు వస్తున్నారు. మార్గమధ్యలో కాల్వపల్లి సమీపంలోని ఆశ్రమం వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి రోడ్డు ఎడమ వైపు చెట్లపొదల్లోకి దూసుకెళ్లి ఆగింది. ఈ ఘటనలో ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులకు తాగునీరు అందించారు. బస్సు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొన్నా లేదా బోల్తా పడినా అందులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడేవారు. కాగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కొందరు ప్రయాణికులు పేర్కొన్నారు.

రైతు రాజ్యమంటే రైతులకు సంకెళ్లు వేయడమా



మాట్లాడుతున్న జనగాం ఉపేందర్‌రెడ్డి

ఆలేరురూరల్: రైతు రాజ్యమంటే రైతులకు సంకెళ్లు వేయడమా అని పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్డులో భూములు పోతున్నాయని, న్యాయం చేయాలని ఆందోళన చేస్తే అరెస్ట్ చేసి జైలుకు పంపడం హేయమైన చర్య అన్నారు. గురువారం ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి మండలం రాయగిరి రైతులు గతంలో జాతీయ రహదారి వెంట సాగునీటి కాల్వలు, విద్యుత్ టవర్ల కోసం భూములు కోల్పోయారని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు కోసం మరోసారి భూములు కోల్పోతున్నారన్నారు. తమకు ఉన్న కొద్దిపాటి భూములు తీసుకోవద్దని అలైన్‌మెంట్ మార్చాలని ఆందోళన చేస్తే పోలీసులు వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం అన్యాయమన్నారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకువెళ్లడం దారుణమన్నారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వర్షాకాలం వచ్చినా ఇంకా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదన్నారు. పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, దధరథ, వెంకటేష్, గణేష్, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడే హంతకుడు

- మద్యం మత్తులో ఘాతుకం
- వీడిన హత్య కేసు మిస్టరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గత నెల 31న రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తిని అతడి స్నేహితుడే మద్యం మత్తులో హతమార్చినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ జి. రాజశేఖర్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన నవిల నవీన్, ఆకారపు శేఖర్ ప్రాణ స్నేహితులు. వీరిద్దరూ టిప్పర్ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 31న అర్ధరాత్రి శేఖర్, నవీన్‌లు ఇద్దరు కలిసి సుందరయ్యకాలనీలో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ పక్కనే దొరికిన ఖాళీ బీరు సీసాతో శేఖర్ తలపై బలంగా కొట్టడంతో అతడు కిందపడిపోయాడు. అయినప్పటికీ ఆగకుండా ఇటుకతో శేఖర్ తలపై కొట్టి, కడుపులో తన్నగా అక్కడికక్కడే మృతిచెందగా, నవీన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు శేఖర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులుకు ఫిర్యాదు చేశారు. శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కాల్‌లిస్ట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు నవీన్‌ను గురువారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ యాకూబ్, హెడ్‌కానిస్టేబుళ్లు గొర్ల కృష్ణ, గోదిశ కరుణాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- ఒక పశువు మృతి
- డీసీఎంలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలు



వెలిమినేడు శివారులో బోల్తా కొట్టిన డీసీఎం, అందులోని పశువులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా కొట్టింది. చిట్యాల ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు 20 పశువులతో అతివేగంగా వెళ్తున్న డీసీఎం వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న గుంతలోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక పశువు మృతిచెందగా, మిగతావి గాయపడ్డాయి. డీసీఎంలో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నంకు చెందిన బాతుగంటి అప్పన్నకి తీవ్ర గాయాలవ్వగా, అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇంట్లోంచి వెళ్లిన బాలుర ఆచూకీ లభ్యం

- తల్లికి అప్పగించిన పోలీసులు



ఇద్దరు బాలురను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

తుర్కపల్లి: తల్లి మందలించిందని మనస్తాపంతో ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యమైంది. తుర్కపల్లి పోలీసులు గురువారం ఇద్దరిని వారి తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దండుపల్లికి చెందిన పిట్టల యాదమ్మ పదిహేను సంవత్సరాలుగా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో నివాసముంటూ కోళ్ల షెడ్డులో కూలీగా పనిచేస్తుంది. ఈమె భర్త దేవేందర్‌రావుకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య అయిన పిట్టల యాదమ్మకు కుమారులు విజయ్(15) చరణ్(9) ఉన్నారు. పెద్ద కుమారుడు విజయ్ దత్తాయపల్లిలో యాదమ్మ వద్దే ఉంటుండగా, చిన్నకొడుకు చరణ్ మేడ్చల్ జిల్లా దండుపల్లిలో తండ్రి వద్ద ఉండేవాడు. దేవేందర్‌రావు రెండు నెలల క్రితం చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. దీంతో చిన్న కుమారుడిని కూడా యాదమ్మ దత్తాయపల్లికి తీసుకొచ్చింది.

తల్లి తిట్టిందని..

విజయ్, చరణ్‌లు రోజూ గొడవ పడుతుండడంతో తల్లి యాదమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వారిద్దరు రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న రూ.2వేల నగదు, టీవీఎస్ ఎక్సెల్ తీసుకుని ఇంటి నుంచి పారిపోయారు. మంగళవారం రాత్రి వరకు పిల్లల కోసం యాదమ్మ చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఉదయం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరూ భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి దుర్గమ్మ గుడి వద్ద ఉన్నట్లు గుర్తించి వారిని గురువారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాము తీసుకువెళ్లిన టీవీఎస్ ఎక్సెల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించి తీసుకువెళ్లారని విజయ్, చరణ్ పోలీసులకు తెలిపారు. ఇద్దరు బాలురను పోలీస్ స్టేషన్‌లో తల్లి యాదమ్మకు అప్పగించారు. పిల్లలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



తుర్కపల్లి: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ స్టేజీ గురువారం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. మృతుడు వేసుకున్న షర్ట్ పైన 'శేఖర్ టైలర్, భోగారం' అని లేబుల్ ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

దేవరకొండ: చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం దేవరకొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన కడారి కొండల్(27) చందంపేట మండల పరిధిలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం కొండల్ భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వైద్యం కోసం దాదాపు రూ.10లక్షల మేర ఖర్చు చేసినప్పటికీ ఆమె మృతి చెందింది. వివాహ సమయంలో కట్నంగా ఇచ్చిన డబ్బులు నాలుగు నెలల వ్యవధిలో తిరిగి ఇచ్చేలా కొండల్‌తో భార్య తరఫు బంధువులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో డబ్బులు తిరిగి ఇవ్వలేకపోవడంతో మనస్తాపానికి గురైన కొండల్ గురువారం చింతబావి గ్రామ పరిధిలో గల తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడి మృతికి కారణమైన నోముల పెద్దయ్య, మల్లేశ్, యాదమ్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి తల్లి యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో వృద్ధురాలు మృతి



మారమ్మ మృతదేహం

చౌటుప్పల్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఓ వృద్ధురాలు ఆకస్మికంగా మృతిచెందింది. వివరాలు.. నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన పంకెర్ల మారమ్మ(65) జ్వరంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ఆమెను భర్త దేవయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం సాయంత్రం స్వగ్రామానికి బయల్దేరారు. హైదరాబాద్‌లో బస్సు ఎక్కి చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో రాత్రి దిగి, స్వగ్రామానికి వెళ్లే మరో బస్సు కోసం వేచి చూస్తున్నారు. అక్కడే ఉన్న బెంచీపై కూర్చొని భార్యాభర్తలు మాట్లాడుకుంటుండగా అంతలోనే మారమ్మ ఆకస్మికంగా కిందపడిపోయింది. పక్కనే ఉన్న ప్రయాణికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే మారమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా మారమ్మ వడదెబ్బకు గురై మృతిచెంది ఉండవచ్చునని ప్రయాణికులు భావిస్తున్నారు. తన కళ్ల ముందే భార్య మృతిచెందడంతో భర్త దేవయ్య బోరున విలపించాడు.


తాళం వేసిన ఇంట్లో చోరీ

- అర కిలో వెండి సామగ్రి అపహరణ

కొండమల్లేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి అర కిలో వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విలేకరుల కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విలేకరుల కాలనీలో నివాసముంటున్న దుండిగళ్ల అశోక్ భార్య గురువారం ఉదయం యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్లింది. ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అశోక్ రోజుమాదిరిగా కాలేజీకి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. సాయంత్రం అశోక్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవరంగా ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అరకిలో వెండి సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ వీరబాబు క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేలకు సారం.. పంటకు జీవం

- సేంద్రియ వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- అధిక దిగుబడులతో పాటు సాగు ఖర్చులూ తగ్గుతాయని నిపుణుల సూచన



పాడి పంట

హుజూర్‌నగర్‌రూరల్ : మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు అన్నదాతలు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభం కానుండటంతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. నేలను సారవంతం చేయడం, భూసారం పెంచడం, దుక్కులు దున్నడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. భూముల్లో సారం కోల్పోయి పంట దిగుబడి రాక ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్న రైతులు పెట్టుబడుల భారాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో సేంద్రియ ఎరువులపై ఆసక్తి కనబరుస్తున్నారు.



ఎరువు కోసం పొలంలో తోలిన గొర్రెల మంద



పొలంలో పోసిన చెరువు మట్టి

సేంద్రియ ఎరువులు వాడితే..

రసాయనిక ఎరువుల ధరలు భారీగా పెరగడంతో పాటు వాటినే ఎక్కువగా రైతులు వాడుతుండడంతో భూములు సారం కోల్పోయి క్రమంగా దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పంట దిగుబడుల కోసం చెరువు మట్టి, పశువుల ఎరువులతో భూసారం పెరిగి దిగుబడులు వస్తాయని పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడకంతో దిగుబడులు పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ ఎరువుల కంటే సేంద్రియ వ్యవసాయంతో భూసారాన్ని రక్షించడంతో పాటు బంగారు పంటలు పండించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భూమి నిస్సారం చేసే రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడితే సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం కంపోస్ట్ ఎరువు తయారీతో పాటు పొలాల్లో పశువుల పెంటలు పెట్టడం, సేకరించిన ఎరువులను పొలాల్లో చల్లుకోవడం లాంటి పనులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

సేంద్రియ ఎరువునే వాడుతున్నా..



పొలంలో మూడేండ్లుగా సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. దీంతో గతేడాది మంచి దిగుబడి వచ్చింది. రసాయన ఎరువు వాడకం తగ్గించడంతో మొక్క ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. సేంద్రియ ఎరువుతో పండించిన పంటలు బాగున్నాయి. ఈ వరి ధాన్యం బియ్యం పట్టుకుని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.

– గునగంటి కనకయ్య, రైతు సీతరాంపురం

అనేక పోషకాలు ఉంటాయి



సేంద్రియ ఎరువులలో అనేక పోషకాలు ఉంటాయి. రసాయన ఎరువులు పదేపదే వాడితే మేలుకంటే కీడే ఎక్కువ. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. పొలాల్లో గొర్రెలు, మేకల పెంటలను పెట్టుకోవాలి. కోళ్ల ఎరువులతోనూ మంచి ఫలితాలుంటాయి.

– రావిరాల స్వర్ణ ఏఓ, హుజూర్‌నగర్